క్లుప్తంగా

ఉత్సవాల్లో ఘర్షణలకు పాల్పడవద్దు


ఎస్‌ఐ గణేష్

నెల్లిమర్ల: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఘర్షణలు, కొట్లాటలకు పాల్పడితే కేసులు పెడతామని ఎస్‌ఐ బి.గణేష్ హెచ్చరించారు. ఇదే విషయమై ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కొన్ని గ్రామాల్లో ఆకతాయిలు కావాలనే గొడవలకు పాల్పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వ్యక్తులను ఉపేక్షించేది లేదని, వారిపై కేసులు నమోదుకు వెనకాడమని స్పష్టం చేశారు. గతేడాది నిర్వహించిన వినాయక ఉత్సవాల్లో కొట్లాటకు దిగిన వారిపై అప్పట్లో కేసులు నమోదు చేశామని గుర్తుచేశారు. ఆ కేసుల్లో ఇరుక్కున్న యువకులు ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఒకసారి కేసు నమోదైతే ప్రభుత్వ ఉద్యోగాలకు కూడా అనర్హులవుతారని తెలిపారు. అలాగే మండపాల వద్ద, ఊరేగింపులో డీజే సౌండ్స్ ఉపయోగించవద్దని, బాణాసంచా కాల్చవద్దని చెప్పారు.

సన్మానం


నాగేశ్వరరావును సన్మానించిన ఉపాధ్యాయులు

నెల్లిమర్ల: మండలంలో సుదీర్ఘకాలం పనిచేసి ప్రస్తుతం గరివిడి మండలంలోని చుక్కలవలస గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తూ రిటైర్ అయిన ఉపాధ్యాయుడు ఎన్ను నాగేశ్వరరావును మండలంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. నెల్లిమర్ల, గరివిడి, చీపురుపల్లి మండలాల నుంచి పెద్దఎత్తున ఉపాధ్యాయులు, బంధువులు, కుటుంబ సభ్యులు వచ్చి నాగేశ్వరరావు దంపతులను సత్కరించారు.

ప్రతిభావంతులకు పట్టాభిషేకం


అవార్డు అందుకుంటున్న తిరుపతినాయుడు

విజయనగరం టౌన్: విశాఖలోని ద్వారకానగర్‌లో ఉన్న విశాఖ పౌర గ్రంథాలయంలో ప్రతిభావంతులకు పట్టాభిషేకం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన ప్రతిభ క్రీడా, సాంస్కృతిక సంస్థ 25వ వార్షికోత్సవం పురస్కరించుకుని, చేసిన ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన సీనియర్ డ్రామా, మూవీ ఆర్టిస్ట్, నంది అవార్డు గ్రహీత దాసరి తిరుపతినాయుడు మాస్టారును ప్రతిభా కళారత్న అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ మేరకు పలువురు జిల్లాకు చెందిన కళాకారులు ఆయన సత్కారం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఏపీ హెచ్‌ఎం సంఘం అడిషనల్ జనరల్ సెక్రటరీగా శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: ఏపీ హెచ్‌ఎం సంఘం అడిషనల్ జనరల్ సెక్రటరీగా జిల్లాకు చెందిన ప్రధానోపాధ్యాయుడు పీఏజీహెచ్ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో ఆయన ఎన్నిక ఖరారైనట్లు ఆదివారం తెలిపారు. ఈ మేరకు ఆ సంఘ సభ్యులంతా ఆయన ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సకల కళల సమాహారం హరికథా గానం

విజయనగరం టౌన్: సకల కళల సమాహారం హరికథా గానమని, అటువంటి హరికథకు పితామహుడైన ఆదిభట్ల నారాయణదాసు జయంతి నిర్వహించుకోవడం తమ పూర్వజన్మసుకృతమని తెలుగు భాషా సేవా సంఘం వ్యవస్థాపకుడు ఆర్‌బీ రామానాయుడు అన్నారు. స్థానిక గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్‌లో ఆదిభట్ల 161వ జయంతి ఆదివారం నిర్వహించారు. ప్రతి విద్యార్థి చదువులో భాగంగా అన్ని కళల గూర్చి తెలుసుకోవాలని, గొప్ప కళాకారులను స్మరించుకుని గౌరవించుకోవాలని వక్తలు కోరారు.

ఆకతాయిల వేధింపులు అరికట్టేందుకు శక్తి టీమ్‌లు

విజయనగరం క్రైమ్: ఆకతాయిల వేధింపులు అరికట్టేందుకు శక్తి టీమ్‌లు ఏర్పాటు చేశామని ఎస్పీ వకుల్ జిందల్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఆరుగురు సభ్యులున్న బృందాలు ఐదు ఉంటాయని, ఒక్కో బృందం ఎస్‌ఐ నాయకత్వంలో పనిచేస్తుందని స్పష్టం చేశారు. అన్ని బృందాల పనితీరును పర్యవేక్షించేందుకు అడ్మిన్ అదనపు ఎస్పీ ఉంటారన్నారు. ఆపద సమయంలో ఫోన్‌లోని శక్తి యాప్‌ను సంప్రదిస్తే పోలీసుల బృందం వచ్చి రక్షణ కల్పిస్తారన్నారు.

ప్రజాధనం వృథా

- సుందరపేట సీహెచ్‌సీ వద్ద గుట్టగుట్టలుగా పాడైన సిమెంట్ బస్తాలు
- ఆస్పత్రి అధికారుల నిర్లక్ష్యంతో దుస్థితి


ఆస్పత్రిలో ఆవరణలో నిర్లక్ష్యంగా పడేయడంతో పాడైన సిమెంట్ బస్తాలు

భోగాపురం: అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం వృథా అవుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనికి సజీవ సాక్ష్యంగా భోగాపురం మండలం, సుందరపేట సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్) వద్ద పాడైన సిమెంట్ బస్తాలు నిలుస్తున్నాయి. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలలు, కళాశాలలను అభివృద్ధికి నడుంబిగించింది. కొన్ని కోట్ల రూపాయల నిధులు విడుదల చేసి వాటిని బాగు చేయించింది. ఈ నేపథ్యంలో ఈ సీహెచ్‌సీలో అదనపు గదుల భవన నిర్మాణానికి రూ.4 కోట్ల నిధులను విడుదల చేసింది. దీంతో చేపట్టిన నిర్మాణ పనులకు అప్పట్లో పెద్దమొత్తంలో సిమెంట్ బస్తాలు తీసుకువచ్చారు. వాటిలో కొన్ని నిర్మాణానికి వినియోగించగా మిగిలిపోయినవి ఇలా ఆస్పత్రి ఆరుబయట ఉంచేశారు. అవి అలాగే కొన్నిరోజుల పాటు ఎండకు..వానకు..గురై పనికి రాకుండా పోయాయి. ఆస్పత్రికి వచ్చే వారంతా ఈ పాడైన సిమెంట్ బస్తాలు చూసి ఇలాగేనా వృథా చేసేదని మండిపడుతున్నారు. పని అయిపోయిన తర్వాత మిగిలిన బస్తాలు భద్రపరచడం తెలీదా అని ఆస్పత్రి సిబ్బంది వైఖరిని నిలదీస్తున్నారు. ఇలాంటివి రాష్ట్ర వ్యాప్తంగా జరిగితే ఎంత నష్టమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, దీనిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చెట్లు నరికివేతపై ఫిర్యాదు


పెదబత్తివలస గ్రామంలో నరికివేస్తున్న నీలగిరి చెట్లు

పూసపాటిరేగ: మండలంలోని పెదబత్తివలస గ్రామంలోని వివాదాస్పద ప్రభుత్వ భూమిలోని నీలగిరి చెట్లు నరికివేతపై గ్రామస్తులు అధికారులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పందించిన రెవెన్యూ అధికారులు చెట్ల నరికివేతను అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 1, సర్వే నంబరు 2–1లో నీలగిరి తోట ఉంది. ఒమ్మి గ్రామానికి చెందిన వాలిరెడ్డి శ్రీరాములునాయుడు ఇక్కడి నీలగిరి చెట్లను వేరొకరికి విక్రయించగా, చెట్లు నరికివేత చేపట్టారు. ఈ విషయంపై గ్రామస్తులు చేసిన ఫిర్యాదుతో వీఆర్‌వో రామునాయుడు క్షేత్రస్థాయికి వెళ్లి, చెట్లు నరకడాన్ని తాత్కాలికంగా ఆపాలని ఆదేశించారు. సర్వే చేసిన తర్వాత ప్రభుత్వం ఇచ్చిన డీ–పట్టాలో తోట ఉందా లేదా ప్రభుత్వ ఫారెస్ట్ భూమిలో ఉందా అనే విషయం తేలిన తర్వాతనే దీనిపై తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని వీఆర్‌వో స్పష్టం చేశారు.

జ్ఞాన సాధనకు తొలి సోపానం గురువు

విజయనగరం టౌన్: జ్ఞాన సాధనకు తొలి సోపానం గురువు అని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సుపథ రూపకర్త యూవీఏఎస్ రాజు అన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి, కుసుమంచి ఫౌండేషన్ వారు సంయుక్తంగా నగరంలో ఆదివారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సద్గురువు బోధనలతోనే సుస్థిరత ఏర్పడుతుందన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ మాట్లాడుతూ విద్య పట్ల ప్రేరణ కలిగించేవాడు, మహోన్నతుడిగా ఎదగడానికి తగిన సూచనలు చేసేవాడు, అమృతతుల్యమైన మాటలతో అలరింపజేసేవాడు, ధర్మాధర్మాల పట్ల సునిశిత జ్ఞానం కలిగినవాడు గురువన్నారు. అనంతరం ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన 50 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో కుసుమంచి సుబ్బారావు, డాక్టర్ పి.స్వప్నహైందవి తదితరులు పాల్గొన్నారు.


అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి

సమస్యల వలయంలో వేపాడ

- అధ్వానంగా ప్రధాన రహదారి
- పల్లె వెలుగు బస్సులకు నోచుకోని మండల కేంద్రం
- పట్టించుకోని అధికారులు


రోడ్డు విస్తరణలో తొలగించిన ఇళ్ల ముందు భాగాలు

వేపాడ: మండల కేంద్రం పలు సమస్యలతో సతమతవుతోంది. పాలకులు గాని అధికారులు గాని పట్టించుకోకపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు. రెండేళ్లుగా అధ్వాన ర హదారిపై రాకపోకలు సాగిస్తున్నా అధికారుల్లో చలనం లేదు. నాటి కలెక్టర్ పూనం మాలకొండయ్య చొరవతో మండల కేంద్రంలో ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించారు. అలాగే అప్పటి ఎమ్మెల్యే శోభా హైమావతి చొరవతో సోంపురం – ఆనందపురం వయా వేపాడ రహదారి అభివృద్ధి జరిగింది. అలాగే సోంపురం వద్ద రైల్వే బ్రిడ్జి ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఎటువంటి అభివృద్ధి జరగలేదు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాత్రం సోంపురం – ఆనందపురం వయా వేపాడ రహదారి (16.4 కిలోమీటర్లు) అభివృద్ధికి ఎన్‌డీబీ నిధులు రూ. 36 కోట్లు మంజూరయ్యాయి. అయితే కాంట్రాక్టర్ 12 కిలోమీటర్ల మేర తారు రోడ్డు వేసి ఎడాదిన్నర దాటిపోతున్నా తిరిగి పనులు చేపట్టడం లేదు. అలాగే వేపాడ, సోంపురం, అరిగిపాలెం గ్రామాలో డ్రైనేజీలు నిర్మించాల్సి ఉంది. అయినప్పటికీ అటు అధికారులు గాని ఇటు పాలకులకు గాని పట్టించుకోకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి..



చెప్పుకోవడానికే మండల కేంద్రం. ప్రజలకు బస్సు సౌకర్యం లేదు. ఆటోల్లోనే ప్రయాణించాల్సిన పరిస్థితి. ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇంటికి చేరుకోవాలంటే నానా అవస్థలు పడుతున్నాం. ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. అధికారులు, పాలకులు స్పందించాలి.
– నిరుజోగి నాయుడు, వేపాడ

ఇబ్బంది పడుతున్నాం..



వేపాడ శివారు బక్కునాయుడుపేట రోడ్డు అధ్వానంగా మారింది. మూడు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1500 మంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను చూసేందుకు ప్రతి వారం పాఠశాలలకు వస్తుంటారు. దీంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు సదుపాయం కల్పించాలి.
– గొంప రమణ, రైతు, బక్కునాయుడుపేట, వేపాడ మండలం

డ్రైనేజీలు పూర్తి చేయండి..



వేపాడలో రోడ్డు విస్తరణ పేరిట ఇళ్ల గుమ్మాలు, అరుగులు తొలగించారు. ఏడాదిన్నర అయినా ఇంతవరకు కాలువలు నిర్మించలేదు. ఇళ్ల మెట్లు తొలగించడంతో వృద్దులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు వేయకపోయినా కనీసం కాలువలైనా నిర్మించి ఇబ్బందులు తీర్చండి.
– నెక్కల రమణమ్మ, గృహిణి, వేపాడ

పల్లె వెలుగు కరువు..

నిత్యం వేపాడ మండల కేంద్రానికి ఉద్యోగులు, వ్యాపారులు, వివిధ పనుల మీద ప్రజలు వస్తుంటారు. అయితే మండల కేంద్రానికి కనీసం పల్లెవెలుగు బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించక తప్పని పరిస్థితి. మండలాన్ని ఏనాడూ జిల్లా అధికారులు సందర్శించే దాఖలాలు లేవు. ఎప్పుడో ఒకప్పుడు అధికారులు వచ్చినా తూతూమంత్రంగా కార్యాలయాల్లో అడుగుపెట్టి వెళ్లిపోతున్నారు.

55 వేల జనాబా..

ఎన్నికలు వస్తే వేపాడ మండలం మా పార్టీకి కంచుకోట అంటే.. మా పార్టీకి కంచుకోట అని చెప్పుకునే నాయకులు అధికారం వచ్చాక మండలం అభివృద్ధికి మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. మండల కేంద్రానికి రావాలంటే కొండగంగుబూడి నుంచి 20 కిలోమీటర్లు.. వావిలపాడు నుంచి 12.. నల్లబిల్లి నుంచి 10.. కుమ్మపల్లి, కేఆర్ పేట నుంచి రావాలంటే 10 నుంచి 13 కిలోమీటర్లు ఆటోల్లో ప్రయాణించాలి. అలాగే వీలుపర్తి, వెల్దాం, చామలడవి, దబ్బిరాజుపేట, కరకవలస, చామలాపల్లి, ఆతవ, శింగరాయి, చినగుడిపాల, జమ్మాదేవిపేట, తదితర గ్రామాల ప్రజలు వేపాడ ప్రధాన రహదారి మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంది. అయితే ప్రధాన రహదారి అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

సమస్యలివే..

మండల కేంద్రానికి బస్సు సౌకర్యం లేదు. అనకాపల్లి, విజయనగరం, విశాఖ ప్రాంతాలకు ఇక్కడ నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. వేపాడ ప్రధాన రహదారితో పాటు వేపాడ – ఆనందపురం, బక్కునాయుడుపేట రోడ్డును అభివృద్ధి చేయాలి. మండల వ్యవసాయ కేంద్రం భవనం కారిపోతోంది. మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఆయుర్వేదిక్ ఆస్పత్రికి సొంత భవనం లేకపోవడంతో ఇరుకు గదుల్లో వైద్యసేవలు అందిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, పాలకులు, స్పందించి సమస్యలు పరిష్కరించాలని మండల వాసులు కోరుతున్నారు.

వినాయక చవితి వేడుకల్లో ఆటల పోటీలు


పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసి, సత్కరిస్తున్న కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం టౌన్: స్థానిక వై జంక్షన్ సమీపంలోని కేవీఆర్ ఎస్టేట్స్‌లో జరుగుతున్న వినాయక చవితి వేడుకల్లో ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు శర్మాజీ, రాజీవ్, మురళి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా అందరూ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసి, సీనియర్ సిటిజన్లను సత్కరించారు.

2న వైఎస్సార్ వర్ధంతికి తరలిరండి



మాట్లాడుతున్న పార్టీ నగర, మండల అధ్యక్షులు వేణు, త్రినాథ్

విజయనగరం: జిల్లా కేంద్రంలో ఈ నెల 2వ తేదీన నిర్వహించనున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి(వైఎస్సార్) వర్ధంతి కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలంతా తరలిరావాలని పార్టీ విజయనగరం అధ్యక్షుడు ఆశపు వేణు, పార్టీ మండల అధ్యక్షుడు కెల్ల త్రినాథ్‌లు కోరారు. ఇదే విషయమై వారు నగరంలోని మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మంగళవారం జరిగే ఈ కార్యక్రమంలో సీఎంఆర్ జంక్షన్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. ఇదే విధంగా నియోజకవర్గంలోని అన్ని మండలాలు, డివిజన్లు, గ్రామాల్లోనూ కార్యక్రమం చేసేందుకు నిర్ణయించడం జరిగిందన్నారు. ఎక్కడ జరిగిన కార్యక్రమానికి అక్కడి నాయకులు, కార్యకర్తలు హాజరై, మహానేతకు ఘనంగా నివాళులర్పించాలన్నారు. వారి వెంట కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టి వీరవెంకటరాజేశ్వరరావు, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, కార్పొరేటర్లు జీవీ రంగారావు, బండారు ఆనంద్ ఉన్నారు.

వైద్యుడి ఔదార్యం

- రూ.15 లక్షలతో ఆలయ పునర్నిర్మాణం


పునః ప్రారంభానికి సిద్ధమైన శ్రీసత్యనారాయణ స్వామి దేవాలయం


మార్బుల్స్‌తో ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దిన దృశ్యం

వంగర: రాజాం పట్టణంలో స్థిరపడిన వంగర మండలం రుషింగి గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యుడు, మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ అధినేత యలకల సురేష్‌కుమార్ తన ఔదార్యం చాటుకున్నారు. పుట్టిన ఊరి కోసం ఏదైనా మంచి చేయాలనే తపనతో తన స్వగ్రామం రుషింగిలో జీర్ణావస్థకు చేరుకున్న శ్రీసత్యనారాయణ స్వామి ఆలయ జీర్ణోద్ధరణకు పూనుకున్నారు. తన సొంత నిధులు సుమారు రూ.15 లక్షలు వెచ్చించి ఆలయాన్ని పునర్నిర్మించారు. ముఖద్వారం నుంచి ధ్వజస్తంభం, గర్భగుడి, గుడి గోపురం అంతా సర్వాంగ సుందరంగా నిర్మింపజేశారు. గ్రిల్స్‌తో క్యూలైన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మించారు. తాగునీటి సదుపాయం, విద్యుద్దీకరణ పనులు కూడా పూర్తయ్యాయి. ఆలయ ప్రాంగణంలో వివాహ కార్యక్రమాలు చేసుకునేందుకు వీలుగా సదుపాయాలు కల్పించారు. త్వరలో ఆలయాన్ని పునః ప్రారంభించనున్నారు. ఆలయాన్ని అత్యాధునిక హంగులతో నిర్మించిన డాక్టర్ యలకల సురేష్‌ను రుషింగి గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు అభినందిస్తున్నారు.

ఊరి రుణం తీర్చుకోవాలి



ప్రతి ఒక్కరూ తాము పుట్టిన ఊరి రుణం తీర్చుకోవాలి. నేను పుట్టిన ఊరికి ఏదో ఒక మంచి పని చేయాలని ఆలోచించాను. గ్రామంలో జీర్ణావస్థకు చేరుకున్న పురాతన శ్రీసత్యనారాయణ స్వామి ఆలయాన్ని మాపూర్వీకులు యలకల రమణమ్మ, యలకల జోగులమ్మల జ్ఞాపకార్థం పునర్నిర్మించాను. ప్రజల్లో భక్తిభావంతోపాటు సేవాభావం పెంపొందాలి.
– డాక్టర్ యలకల సురేష్‌కుమార్, మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ అధినేత రాజాం.

ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు


కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న ఎంపీపీ హైమావతి, తదితరులు

- ఎంపీపీ హైమావతి, జెడ్పీటీసీ సభ్యుడు నరసింహమూర్తి

గంట్యాడ: పిల్లను ఇచ్చిన మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను కూడా వెన్నుపోటు పొడిచారని ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి ఆరోపించారు. మండలంలోని రామవరంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. చంద్రబాబు ప్రభుత్వం కేవలం ధనికుల కోసమే పనిచేస్తోందన్నారు. కూటమి నాయకులు ఇష్టానుసారంగా ఇసుక, గ్రావెల్ దోచేస్తున్నారని ఆరోపించారు. ఊరికి 50 చొప్పున బెల్ట్‌షాపులు వెలిశాయన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతులకు యూరియా అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. సెర్ప్ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ జిల్లాకు చెందిన వాడైనప్పటికీ ఇంతవరకు ఒక్క కొత్త పింఛన్ కూడా ఇవ్వలేదన్నారు. రీ వెరిఫికేషన్ పేరుతో అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తీసేశారని మండిపడ్డారు. దివ్యాంగులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న కూటమి నాయకులు ఇంతవరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలన్నారు. ఆడబిడ్డ నిధి పథకానికి అతీగతీ లేకుండా పోయిందన్నారు. కూటమి పాలనను ప్రశ్నించిన వారిని రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, సర్పంచ్ పీరుబండి పద్మ, యువజన విభాగం అధ్యక్షుడు కె. విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు పి. వెంకటరావు, రైతు విభాగం కార్యదర్శి జాగరపు సత్యారావు, పార్టీ నాయకులు కృష్ణంరాజు, పి.నారాయణమూర్తి, లచ్చిరెడ్డి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.